
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి
మెదక్
5
గురువారం 14 నవంబరు 2024
జిల్లాల వార్తలు



వెంటవెంటనే ట్యాబ్ ఎంట్రీ చేయాలి

- చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం
- రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దు
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

హత్నూర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బు రైతులకు సకాలంలో చెల్లించేందుకు వెంటవెంటనే ట్యాబ్ ఎంట్రీ చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. హత్నూర మండల పరిధిలోని చందాపూర్, పల్పనూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. వ్యవసాయ అధికారులు పంట వివరాలు తప్పుగా నమోదు చేయడంతో ట్యాబ్‌లో ఎంట్రీ ఆలస్యం జరుగుతుందని నిర్వాహకులు కలెక్టర్‌కు తెలిపారు. వెంటనే పంట వివరాలు సరి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆమె ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందిస్తున్న సదుపాయాలు, కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలు తెలుసుకుని, వాటికి తగిన పరిష్కారాలు చూపేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తేమశాతాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులకు మద్దతు ధర కల్పిస్తున్నామని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు అమ్మి మోసపోవద్దన్నారు. మండల పరిధిలోని పల్పనూర్, చందాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న ఇంటింటి సమగ్ర సర్వేను కలెక్టర్ క్రాంతి పరిశీలించారు. సర్వేలో ఎలాంటి తప్పులు జరుగకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎన్యూమరేటర్లు సేకరిస్తున్న సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆమె వెంట జడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న, తహసీల్దార్ పర్వీన్ షేక్, ఎంపీడీవో శంకర్, ఎంపీవో యూసుఫ్, ఏపీఎం దేవేందర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



పల్పనూర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

ప్రైవేటు ఆస్పత్రుల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీ తనిఖీలు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో స్టేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ బృందం బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. కలెక్టరేట్ సమీపంలోని రెండు ప్రైవేటు ఆస్పత్రులతో పాటు ఫసల్‌వాదీ శివారులోని మరో ప్రైవేటు ఆస్పత్రిని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ట్రీట్‌మెంట్ ధరల పట్టిక, డాక్టర్లు, సిబ్బంది వివరాలు, బయో మెడికల్ వేస్ట్‌మెనేజ్‌మెంట్, ఫైర్‌సేఫ్టీతో పాటు చికిత్స అందిస్తున్న డాక్టర్ల విద్యార్హత ధ్రువపత్రాలు, అనుమతి పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి తగు వివరాలను నమోదు చేసుకున్నారు. రోగులకు అందించిన చికిత్సలు, బిల్స్, కేస్ షీట్లతో సరిపోల్చి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సేకరించిన వివరాల నివేదికను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు సమర్పించనున్నారు. లోపాలుంటే దాని ఆధారంగా చర్యలు తీసుకోనున్నారు. స్టేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డా.పుష్పవాణి ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో మెంబర్లు సునీల్‌రాజ్, రమాదేవీ, అనిల్‌కుమార్, వెంకట్‌రామ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, డెమో ప్రసాద్ వీర్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ రవి తదితరులు ఉన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణ నిధులు విడుదల

రూ.2,80,5000 గ్రాంటు మంజూరు



సంగారెడ్డిలోని ఓ కాంప్లెక్స్ స్కూల్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్ గ్రాంటు(సీఆర్సీ) నిర్వహణ నిధులు విడుదలయ్యాయి. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి నిధులను ప్రభుత్వం పూర్తిగా విడుదల చేసింది. పాఠశాలల పర్యవేక్షణ, విద్యావ్యవస్థను నడిపించేందుకు క్లస్టర్‌స్థాయిలో పాఠశాల సముదాయాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వీటికి విద్యాశాఖ నుంచి ప్రతి ఏడాది వాటి నిర్వహణకు నిధులొస్తాయి. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలో 85 ఎంఆర్సీ కేంద్రాలుండగా, వాటి నిర్వహణ కోసం రూ.2,80,5000 నిధులు విడుదలయ్యాయి. వీటిని ఆయా కాంప్లెక్స్ స్కూల్ ఖాతాల్లో జమ చేశారు. కాగా స్కూల్ కాంప్లెక్స్ గ్రాంటు సీఆర్సీ కింద ఏడాదికి రూ.33వేల చొప్పున చెల్లిస్తుండగా వాటిని రిజిస్టర్లు, రికార్డులు, ఇంటర్‌నెట్ బిల్లు, కంప్యూటర్ తదితర అవసరాల కోసం ఆ నిధులు వెచ్చించాల్సి ఉంటుంది.



సంగారెడ్డిలోని ఓ మద్యం దుకాణం పక్కన ఉన్న పర్మిట్ రూమ్

బార్లా తెరిచారు

నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్‌రూమ్‌ల నిర్వహణ

- బల్లాలు, బెంచ్‌ల ఏర్పాటు
- జోరుగా కొనసాగుతున్న సిట్టింగ్‌లు
- నివాస ప్రాంత సమీపంలో ఏర్పాటు
- స్థానికులకు తప్పని ఇబ్బందులు

సంగారెడ్డి క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల వద్ద పర్మిట్‌రూమ్‌లు బార్లను తలపిస్తున్నాయి. పెద్దపెద్ద రేకులషెడ్‌లలో బల్లాలు, బెంచ్‌లను ఏర్పాటు చేసి, తినుబండరాలు, గ్లాసులు, వాటర్‌బాటిళ్ల, కూల్‌డ్రింక్స్ విక్రయస్తూ మినీ బార్లలా నడిపిస్తున్నారు. తెల్లవారుజాము నుంచే మందుబాబులు సిట్టింగ్ వేస్తున్నారు. అర్ధరాత్రి వరకు కొనసాగుతున్నాయి. నివాస ప్రాంత సమీపంలోనే నిబంధనలను ఉల్లంఘిస్తూ వ్యాపారం కొనసాగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

సిట్టింగ్‌లకు సౌకర్యంగా..

ప్రతీ మద్యం దుకాణానికి పర్మిట్‌రూం ఏర్పాటు చేసుకోవడానికి ఎక్సైజ్ శాఖ అనుమతినిస్తుంది. దీన్ని అదనుగా తీసుకుని మద్యం వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఏర్పాటు చేసిన బార్లను సైతం తలదన్నేలా పర్మిట్‌రూమ్‌లు తయారయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 101 మద్యం దుకాణాలు, 34 బార్లు ఉన్నాయి. కొన్నిచోట్ల మద్యం దుకాణాల దుకాణాల వెనుక లేదా పక్కనే మరో దుకాణంలోగానీ లేదా ఖాళీ స్థలంలో పెద్దపెద్ద రేకుల షెడ్లల్లో ఏర్పాటు చేస్తున్నారు. విశాలమైన స్థలాల్లో బల్లాలు, బెంచీలు ఏర్పాటు చేసి సిట్టింగులను నిర్వహిస్తున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి వరకు మందుబాబులతో కళకళలాడుతున్నాయి. గంటల తరబడి మందుబాబులు కూర్చొని మద్యం సేవిస్తున్నారు. పర్మిట్ రూమ్‌లకు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలి. నిర్దీత కొలతల మేరకు చిన్నరూమ్‌లో నిర్వహించాల్సి ఉంటుంది. మందు సీసాలు, గ్లాసులు పెట్టుకునేందుకు మాత్రమే ఒక గోడకు షెల్ఫులు ఏర్పాటు చేయాలి. ఇందులో ఎలాంటి బెంచీలు, బల్లాలు వేయకూడదు. కానీ నిర్వాహకులు నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు.

పాడైపోయిన తినుబండారాల విక్రయాలు

పర్మిట్‌రూమ్‌లలో మద్యం సేవించడానికి అవసరమైన అనేక రకాల స్టఫ్ అందుబాటులో ఉంటుంది. మటన్, చికెన్ ఫ్రై, పాయా, ఫిష్ ఫ్రై, ఉడకబెట్టిన కోడిగుడ్లు, శనగలు, పల్లీలు, బెబ్బర్లు, పెసర్లు, నూనెలో వేయించిన ప్యాలాలు, అటుకులు ఇలా అనేక రకాల తినుబండారాలు లభ్యమవుతాయి. అయితే ఒకటి,రెండు రోజుల క్రితం తయారు చేసిన తినుబండారాలు కూడా విక్రయిస్తున్నారు. పాడైపోయిన మాంసాన్ని వండి మందుబాబులకు అంటగడుతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే మీ ఇష్టం ఉంటే తీసుకోండి లేదంటే లేదు అంటూ సమాధానం ఇస్తున్నారని మందుబాబులు

మిగతా 8వ పేజీలో



సంగారెడ్డి పట్టణంలోని ఓ మద్యం దుకాణం పక్కన అపరిశుభ్రంగా ఉన్న పర్మిట్ రూమ్



సంగారెడ్డి కొత్తబస్టాండ్ మద్యం దుకాణం వద్ద తాగి రోడ్డుపై పడిపోయిన మందుబాబులు

సంగారెడ్డి కొత్తబస్టాండ్ ఎదురుగా

సంగారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న ఓ వైన్‌షాప్ బంగ్లాపైన రేకులషెడ్ ఏర్పాటు చేసి సిట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. పక్కనే అనేక నివాస ప్రాంతాలు ఉన్నాయి. మద్యంబాబులు మద్యం సేవించి ఖాళీ సీసాలు రోడ్డుపై విసిరేయడం, కాగితాలు, ప్లాస్టిక్ గ్లాసులు పక్కనే ఉన్న ఇళ్లపై విసిరేస్తుండటం పట్ల అక్కడి వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక రాత్రి సమయంలో మందుబాబులు రోడ్డుపైనే తాగి పడిపోతున్నారు. అంతేగాక దుకాణాల షెట్టర్ల ముందు మద్యం సేవిస్తుండటం, ప్రధాన రహదారి వరకు వాహనాలు నిలుపడంతో ఆ రోడ్డుపై వాహనాల రాకపోకలు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. ఆ ప్రాంత పరిసరాల్లో ఉన్న మహిళలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.


రేవంత్‌రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ దొంగలే

- ఒకాయన ఢిల్లీలో ఉన్నాడు.. మరొకరు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాడు
- లగచర్ల వివాదం, మల్లన్నసాగర్ పోరాటం రెండింటిది ఒకే తీరు
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

7



ధాన్యం పరిశీలిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు



ఝాన్సీలింగాపూర్‌లో..



రామాయంపేట-మెదక్ రహదారిపై..

రోడ్డెక్కిన అన్నదాతలు

రామాయంపేట మండలం తొనిగండ్ల, ఝాన్సీలింగాపూర్ ప్రాంత రైతులు ధాన్యం ఆరబోసి నెల రోజులు దాటుతున్నా కొనే వారే లేరంటూ ఆగ్రహించారు. తొనిగండ్ల రైతులు రామాయంపేట-మెదక్ రహదారిపై గంట పాటు బైఠాయించి ఉన్నతాధికారులు వచ్చేదాకా ఆందోళన విరమించమంటూ భీష్మించుకుని కూర్చున్నారు. ఝాన్సీలింగాపూర్‌లో ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద అధికారులు వెళ్లకుండా బండ్లను అడ్డంగా పెట్టి రైతులు ధర్నా నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కేంద్రం నిర్వహకులతో వాగ్వాదానికి దిగారు.

- రామాయంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి)

అటు నోటీసులు.. ఇటు కబ్జాలు

వివాదాస్పద భూముల్లో పాగా

- ఏకంగా లేఅవుట్ వేసి బహిరంగంగా అమ్మకాలు
- ఎక్స్‌కవేటర్లతో అక్రమ వెంచర్‌ను తొలగించిన అధికారులు

పటాన్‌చెరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఒక పక్క ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రా నోటీసులు జారీచేస్తుండగా... మరోపక్క రియల్ మాఫియా ఎలాంటి జంకులేకుండా యథేచ్ఛగా కబ్జాలకు తెగబడుతున్నది. ప్రభుత్వ భూమిని కబ్జాచేసి వేసిన లేఅవుట్‌లోని రోడ్లను రెవెన్యూ సిబ్బంది ఎక్స్‌కవేటర్ల సహాయంతో బుధవారం తొలగించారు. ఈ కబ్జా వ్యవహారం వెనక బడా ప్రజాప్రతినిధులు ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. పట్టణంలోని వివాదాస్పద వాల నారాయణరావు ఇండస్ట్రీయల్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ సొసైటీ పేరుతో 1985లో చేసిన లేవుట్‌లోని భూములు క్రమంగా కబ్జాచేసి సొమ్ము చేసుకునేందుకు తెరవెనక గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసింది. సదరు లేవుట్‌లో ప్రభుత్వ భూములు ఉన్నందున దశాబ్దాలుగా వివాదం కొనసాగుతోంది. వివాదాస్పద లేఅవుట్‌లో ఇటీవల రీ డిజైన్‌తో ఎలాంటి అనుమతులు లేకుండానే ప్లాట్లు కొట్టి విక్రయించినట్లు తెలిసింది. అందులో 40 ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఈ వ్యవహారంలో పక్కనే ఉన్న 997 సర్వే నంబరులోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసి లేఅవుట్ వేయడం గమనార్హం. ఈ క్రమంలో అధికారులకు ఫిర్యాదులు రావడంతో అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ లేఅవుట్‌ను తొలగించాలని ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వ భూమిగా గుర్తించిన స్థలం చుట్టూ భారీ కందకాన్ని తవ్వి రోడ్లను తొలగించారు. వివాదాస్పద లేఅవుట్లలోని స్థలాలు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో) కస్టడీలో ఉన్నప్పటికీ ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్లు జరగడం గమనార్హం. డాక్యుమెంట్లపై పట్టా సర్వే నంబరు 1064 వేసి పక్కనే ఉన్న సర్వే నంబరు 997లోని ప్రభుత్వ భూములు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. నిబంధనలకు విరుద్ధంగా గతంలో వేసిన లేఅవుట్‌ను తిరిగి చిన్నచిన్న ప్లాట్లుగా విభజించడంతో రెవెన్యూ సిబ్బంది తొలగించారు.



అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూమిలో వేసిన అక్రమ లేఅవుట్‌ను తొలగింపజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

వేతన వెతలు

- గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల అవస్థలు
- ఏడు నెలలుగా అందని జీతం

పుల్‌కల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో నారాయణఖేడ్‌లో బాలికలు, బాలుర, హత్నూరలో బాలికలు, చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెంలో బాలుర గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఆయా ఉన్నత పాఠశాలల్లో దాదాపు వెయ్యి మంది వరకు విద్యార్థులు విద్యనభ్యస్తుండగా, 34 మంది అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 339 మంది అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. గడిచిన ఏడు నెలలుగా వేతనాలు అందలేదు.

రేయింబవళ్లు పనిచేసిన గుర్తింపు లేదు

స్థానికంగా ఆశ్రమ పాఠశాలల్లోనే ఉంటూ నాణ్యమైన విద్యనందించేందుకు అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు శ్రమిస్తున్నా.. తగిన ఫలితం లేకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులకు ఏమి తక్కువ కాకుండా అన్ని రకాల పోటీ పరీక్షలు రాసి అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లుగా ఎంపికయ్యారు. ఎక్కడో మారుమూల గిరిజన తండాల్లో సరైన రోడ్డు సౌకర్యం కూడా లేని ప్రాంతాల్లో విద్యాబోధన చేస్తున్నారు. విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు, పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వార్షిక పరీక్షల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో మంచి ర్యాంకులు వచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. భార్య, పిల్లలకు దూరంగా ఉంటూ విద్యాబోధన చేస్తున్నప్పటికీ, ప్రతీ నెలా రావాల్సిన వేతనాలు సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. సమయానికి వేతనాలు అందక కుటుంబ పోషణ కష్టంగా మారిందని పలువురు అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు వాపోతున్నారు. రాత్రింబవళ్లు పనిచేసినప్పటికీ, నెలకు కేవలం రూ.12 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఆ అరకొర వేతనాన్ని కూడా ఏజేన్సీల ద్వారా చెల్లిస్తున్నారని, అందులోనూ కోతలు పెడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు ఏడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు మనో వేదనకు గురవుతున్నారు. అన్నీ అర్హతలతో కలెక్టర్ల పర్యవేక్షణలో రోస్టర్ విధానం ద్వారా ఎంపికైన తమకు కనీసం రూ.18 వేలు చెల్లించాలన్న డిమాండ్ చేస్తున్నారు.

పిచ్చికుక్క దాడిలో ఏడుగురికి గాయాలు



గాయాల పాలైన చెంది బాబు, స్రవంతి, నందిని

చేగుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పిచ్చికుక్క దాడిలో ఏడుగురికి గాయాలైన సంఘటన చేగుంట మండల పరిధిలో బుధవారం సాయంత్రం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే రోడ్డుపై ధాన్యం ఆరబోసి ఉన్న రాంపూర్, గొల్లపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులతో పాటు విద్యార్థులపై పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచింది. రాంపూర్ గ్రామానికి చెందిన కాశబోయిన నవనీత, గొల్లపల్లికి చెందిన బాబు, స్రవంతి, గొట్టం కృష్ణవేణితో పాటు పాఠశాల నుంచి గొల్లపల్లి తండాలోని ఇంటికి వెళ్తున్న విద్యార్థులు ప్రణవి, రేఖ, తండాలో చిన్నారి నందినిపై పిచ్చికుక్క దాడి చేసింది. గాయలైన ఏడుగురిని 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



గ్రంథాలయంలోని పుస్తకాలు

విజ్ఞాన సర్వోదయం

- సర్వోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిర్గాపూర్‌లో గ్రంథాలయం, స్టడీ సెంటర్
- దాతల సహకారంతో సకల వసతులు
- అందుబాటులో పోటీపరీక్షల మెటీరియల్

7

పోలీస్‌శాఖలో ఫిజికల్ ఫిట్‌నెస్ కీలకం



హోంగార్డుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో ఫిజికల్ ఫిట్‌నెస్ కీలకమని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ అన్నారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న హోంగార్డులకు బుధవారం వీక్లీ పరేడ్, దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ వ్యాయామం ఆరోగ్యానికి శ్రేయస్కరమని, సిబ్బంది, అధికారులు ప్రతిరోజు వ్యాయామం చేయాలన్నారు. శారీరకంగా శక్తి సామర్థ్యాలతో ఉన్నప్పుడే ఎలాంటి విధులనైనా ధైర్యంగా నిర్వహించగలమని చెప్పారు. ప్రతిరోజు వ్యాయామం చేస్తూ.. శారీరకంగా ఫిట్‌గా ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి, తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. వ్యక్తిగత లేదా డ్యూటీ పరంగా ఎలాంటి సమస్యలున్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావ్, ఆర్మ్‌డ్ రిజర్డ్ డీఎస్పీ నరేందర్, ఆర్‌ఐలు రాజశేఖర్‌రెడ్డి, డానియెల్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డుగా కోమటికుంట

- వ్యర్థాలు, ప్లాస్టిక్ వస్తువుల పారబోత
- తీవ్ర దుర్గంధంతో ప్రజల అవస్థలు
- మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని వేడుకోలు



వ్యర్థాలు, ప్లాస్టిక్ వస్తువులతో డంపింగ్‌యార్డును తలపిస్తున్న కోమటికుంట

నర్సాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణానికి అతి సమీపంలో ఉన్న కోమటికుంట మురికికూపంగా మారింది. ఆ కుంటలో చెత్తతో పాటు ప్లాస్టిక్, వ్యర్థాలు వేయడంతో డంపింగ్‌యార్డును తలపిస్తున్నది. దీంతో ప్రజలు దుర్గంధంతో అవస్థలు పడుతున్నారు. నర్సాపూర్ పట్టణానికి నర్సాపూర్-తూప్రాన్ ప్రధాన మార్గంలో రోడ్డుకు ఆనుకుని కోమటికుంట ఉంది. ఈ కుంట కింద గతంలో 50 ఎకరాలకు పైగా సాగయ్యేది. అయితే పట్టణం రోజురోజుకూ విస్తరించి కుంట పరిధిలో ఉన్న పొలాలన్నీ నేడు ఇళ్లతో కాలనీలుగా మారాయి. ఏదో కొంతమేరకు మాత్రమే ఈ కుంట పరిధిలోని భూముల్లో సాగు చేస్తున్నారు. పట్టణానికి దగ్గర ఉండటంతో పాటు ప్రధాన రోడ్డుకు అతి సమీపంలో ఉన్నందున ఈ కుంటను సుందరీకరణ చేసి గార్డెనింగ్‌తో పాటు కట్టపై వాకింగ్ ట్రాక్ నిర్మించి పట్టణవాసులకు ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తామని కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. అమలుకు నోచుకోవడం లేదు. ప్రస్తుతం ఈ కుంటలో మురుగునీరు, చెత్త, వ్యర్థాలు చేరి డంపింగ్‌యార్డును తలపిస్తున్నది. ఈ కుంట కట్టపై సమీప వ్యాపారస్తులతో పాటు ఇళ్ల వారు ఇష్టానుసారంగా వ్యర్థాలు పారస్తున్నారు. అలాగే సమీప ఇళ్లవారు మురుగునీటిని కుంటలోకే వదులుతున్నారు.

ప్రిన్సిపల్ సెక్రటరీ అసంతృప్తి

ఈ మధ్యనే ప్రిన్సిపల్ సెక్రటరీ భారతిహోలికేరి, కలెక్టర్ రాహుల్‌రాజ్ పట్టణంలో పర్యటించిన సందర్భంగా ఈ కుంట కట్టను సందర్శించారు. ఈ సందర్భంగా కట్ట వద్ద పెద్దఎత్తున ఉన్న చెత్త, ఇతర వ్యర్థాలను చూసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా వెంటనే తొలగించి శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆమె ఆదేశాల మేరకు అప్పటివరకు వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారే తప్ప పూర్తిస్థాయిలో నివారణ చర్యలు చేపట్టలేదు. దీంతో ఒకటి, రెండురోజుల తర్వాత మళ్లీ కుంట పరిసర ప్రాంతాల్లో చెత్తను పారబోస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని కుంటలోకి మురుగునీరు వదలకుండా చూడడంతో పాటు చెత్త, వ్యర్థాలను వేయకుండా చూసి, పట్టణవాసులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని కోరుతున్నారు.

గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

- జిల్లాలో పరీక్షలు రాయనున్న 15,123 మంది అభ్యర్థులు
- జిల్లా వ్యాప్తంగా 49 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో రీజనల్ కో ఆర్డినేటర్లు, స్ట్రాంగ్‌రూమ్, జాయింట్ కస్టోడియన్స్, పోలీస్ నోడల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్, వివిధశాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రూప్-3 పరీక్షలు రాసేందుకు 15,123 అభ్యర్థులు హాజరుకానున్నారని, జిల్లావ్యాప్తంగా 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ చెప్పారు. పరీక్షలు రాసే అభ్యర్థులు నీలం బాల్ పాయింట్ పెన్నులు, పెన్సిల్, ఎరేజర్, హాల్ టికెట్, ఏదేని గుర్తింపు కార్డుని తీసుకురావాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరని తెలిపారు. ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ముందే బయలుదేరాలన్నారు. అలస్యంగా వచ్చి బాధపడేకన్నా పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకుని పరీక్షల్లో విజయం సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు టీజీపీఎస్సీ సూచనలు పాటించి జిల్లా అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఏఎన్ఎం, మందులను అందుబాటులో ఉంచాలని అధికారులను కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు ఎస్పీ సంజీవ్‌రావు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ప్రొఫైల్‌కు అడుగులు

- సంగారెడ్డి జిల్లాలో ప్రయోగాత్మకంగా షురూ
- పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల నుంచి రోగుల రక్త నమూనాలు
- ఫలితాల ఆధారంగా చికిత్స, వివరాలు నిక్షిప్తం

సంగారెడ్డి అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ హెల్త్ కార్డు రూపకల్పనలో భాగంగా ప్రతి ఒక్కరి ఆరోగ్య సమాచారం(హెల్త్ ప్రొఫైల్) నమోదుకు వైద్య ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిఒక్కరి ఆరోగ్య సమాచారం ముందే తెలిసేలా హెల్త్ ప్రొఫైల్ రూపొందిస్తామని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా(పైలెట్)జిల్లాలో అమలుకు చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం సుమారు 15 ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేశారు. రెండురోజుల క్రితం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించారు. హెల్త్ ప్రొఫైల్ రూపకల్పనలో భాగంగా ఆయా ఆరోగ్య కేంద్రాలకు వచ్చే పేషెంట్ల వివరాలు డేటా ఎంట్రీ ఆపరేటర్ ద్వారా నమోదు చేయించి సంబంధిత మెడికల్ ఆఫీసర్ వద్దకు పంపిస్తున్నారు. సదరు డాక్టర్ పరీక్షించి వివిధ రక్త నమూనా పరీక్షల నిమిత్తం సిఫారసు చేస్తున్నారు. పేషెంట్ల నుంచి సేకరించిన రక్త నమూనాలకు జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని టీ-డయాగ్నోస్టిక్ హబ్‌కు పంపి వ్యాధి నిర్ధారణ చేయిస్తున్నారు. మరుసటి రోజు వచ్చిన ఫలితాల ఆధారంగా వైద్య సేవలు, మందులు అందించడంతో పాటు సదరు రోగుల వివరాలు సంబంధిత ప్రొఫార్మాలో నిక్షిప్తం చేస్తున్నారు. ఇందుకోసం టీసీఎస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఈ రకంగా జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల నుంచి నిత్యం సుమారు 250 నుంచి 300 వరకు రోగుల వివరాలను హెల్త్ ప్రొఫైల్‌లో నిక్షిప్తం చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. కాగా హెల్త్ ప్రొఫైల్‌కు సంబంధించి ఆ శాఖ గోప్యత పాటిస్తున్నది.



కొత్లాపూర్‌లో నీటిలో మునిగిపోయిన డంపింగ్‌యార్డు

నీటిలో పల్లె ప్రకృతివనం, డంపింగ్‌యార్డు!

సంగారెడ్డి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం కొత్లాపూర్ గ్రామంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో పోచమ్మకుంటలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షలు వెచ్చించి పల్లె ప్రకృతివనం, డంపింగ్‌యార్డును నిర్మించింది. రెండునెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు అవి పూర్తిగా మునిగాయి. ఇప్పటికైనా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి పోచమ్మ కుంటలోని నీటిని తొలగించాలని కోరుతున్నారు.



నీటిలో ఉన్న పల్లె ప్రకృతివనం

కన్వేయర్ బెల్టు తగిలి కార్మికుడి మృతి



జిన్నుగౌడ మృతదేహం

మనోహరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్క్రాప్ డివైడ్ కన్వేయర్ బెల్ట్ తగిలి కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన రంగాయపల్లి స్టీల్ పరిశ్రమలో చేసుకున్నది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామానికి వచ్చి అద్దెకు ఉంటూ ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం పని నిమిత్తం ముగ్గురూ వెళ్లారు. పనిచేస్తుండగా స్క్రాప్ డివైడ్ కన్వేయర్ బెల్ట్ తగిలి జిన్నుగౌడ(26)కు తీవ్రగాయాలయ్యాయి. పరిశ్రమ సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. మృతుడి అన్న మిట్టు ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీకి పాల్పడిన ఇద్దరికి మూడేళ్ల జైలు

కొండపాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాత్రి సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడిన ఇద్దరి నేరస్తులకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ గజ్వేల్ అదనపు ప్రథమశ్రేణి న్యాయమూర్తి బి.ప్రియాంక తీర్పు చెప్పినట్టు కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఎనిమిది నెలల క్రితం కొండపాక, తిమ్మారెడ్డిపల్లి, కొడకండ్ల, కుకునూరుపల్లి గ్రామాల్లో రాత్రి సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడిన సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం చందర్‌నాయక్‌తండాకు చెందిన రాథోడ్ అలియాస్ జాదవ్‌నగేష్(34), జాదవ్ బలరాం(45) దొంగతనాలకు పాల్పడ్డారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువు కావడంతో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు తీర్పు వెలువరించారని ఎస్‌ఐ వివరించారు.

ఉచితంగా మందుల పంపిణీ

శివ్వంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మధుమేహం దీర్ఘకాలికంగా ఉండేదని, ఆరోగ్య ఆహార సూత్రాలు తప్పనిసరిగా పాటించాలని లయన్స్ క్లబ్ ఆఫ్ బాలనగర్ ఇలైట్ 302బి జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. జాతీయ మధుమేహ నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండల పరిధిలోని మగ్దుంపూర్‌లో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 100 మంది మధుమేహం పేషెంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



పవన్ కళ్యాణ్(ఫైల్)

హవేళిఘణపూర్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన హవేళిఘణపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మూగ పవన్‌కళ్యాణ్(24) తండ్రి నర్సింహులు నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. అప్పటి నుంచి తనకున్న వ్యవసాయంతో పాటు కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబం గడవడమే కష్టంగా ఉందని, ఇక చెల్లి వివాహం చేసేది ఎలా అని తరచూ తల్లితో చెబుతూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పొలం వద్ద పురుగులమందు తాగి తన తల్లికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో అతడిని వెంటనే మెదక్ ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు

టవర్‌లో బ్యాటరీలు చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

శివ్వంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ టవర్‌కు సంబంధించిన 24 బ్యాటరీలను దుండగులు అపహరించకపోయిన సంఘటన చిన్న గొట్టిముక్ల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో ఎయిర్ టెల్ టవర్ దగ్గర నుంచి మంగళవారం రాత్రి బ్యాటరీలను చోరీ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఎయిర్ టెల్ విజిలెన్స్ టీం, సిబ్బంది బాలమురళీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

స్తంభాన్ని ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి




తిరుపతిరెడ్డి (ఫైల్)

గజ్వేల్ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బైక్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన కొల్గూరు గ్రామంలో చోటుచేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిరుదొడ్డి మండలం లక్ష్మినగర్ గ్రామానికి చెందిన పబ్బతి తిరుపతిరెడ్డి(38) వ్యవసాయం చేసుకుంటూ కటుంబాన్ని పోషిస్తున్నారు. బుధవారం గజ్వేల్‌లో పని నిమిత్తం బయలుదేరగా మార్గమధ్యలో కొల్గూరు గ్రామం వద్ద ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం విద్యుత్ స్తంభానికి బలంగా ఢీ కొట్టింది. స్థానికులు 108 అంబులెన్స్‌లో అతడిని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు న మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విజ్ఞాన సర్వోదయం

- సర్వోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిర్గాపూర్‌లో గ్రంథాలయం, స్టడీ సెంటర్
- దాతల సహకారంతో సకల వసతులు
- అందుబాటులో పోటీపరీక్షల మెటీరియల్
- గ్రామీణ యువతకు ఎంతో ఉపయోగం

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



సిర్గాపూర్‌లో ఏర్పాటు చేసిన సర్వోదయ గ్రంథాలయం, స్టడీ సెంటర్

కల్హేర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : నిరుపేద నిరుద్యోగుల సౌకర్యార్థం ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో గ్రంథాలయం, స్టడీ సెంటర్ ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలుస్తున్నది సర్వోదయ గ్రామ సేవా ఫౌండేషన్. గ్రామీణ యువత పోటీ పరీక్షలకు సిద్ధమవడానికి స్టడీ సెంటర్, మెటీరియల్‌తో పాటు, దినపత్రికలు, ఇతర పుస్తకాలను అందుబాటులో ఉంచుతూ వారి పాలిట విజ్ఞాన సర్వోదయంగా మారుతున్నది. ఈ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారి సుధాకర్‌నాయక్ సిర్గాపూర్ మండల కేంద్రంలో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయం, స్టడీసెంటర్ ప్రస్తుతం ఎంతోమంది యువతకు ఉపయోగపడుతున్నది.

అన్నీ వసతులతో..

అధికశాతం గిరిజనులు, పేదలు ఉన్న సిర్గాపూర్ ప్రాంతంలో ఎంతో ప్రతిభ కలిగిన యువత పోటీపరీక్షలకు సిద్ధం కావాలని ఆసక్తి ఉన్నా, తగిన సౌకర్యాలు, పుస్తకాలు కొనుగోలు చేసే స్థోమత లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే పోటీ పరీక్షలకు దూరంగా ఉంటున్నారు. దీన్ని గమనించిన సిర్గాపూర్ తాజా మాజీ సర్పంచ్ జంగం స్వప్న ఈ విషయాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని సిర్గాపూర్‌లో సర్వోదయ గ్రామ సేవా ఫౌండేషన్ సంస్థతో స్టడీసెంటర్, గ్రంథాలయం ఏర్పాటు చేయించారు. సెంటర్ భవనాన్ని గ్రామపంచాయతీ సమకూర్చగా, అందులోకి అల్మారాలు, స్టడీ టేబుళ్లు, కుర్చీలు, అన్నిరకాల పోటీ పరీక్షల మెటీరియల్ తదితర వసతులను సర్వోదయ ఫౌండేషన్ సమకూర్చింది. స్టడీ సెంటర్‌ను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి. సంజీవరెడ్డి చేతులమీదుగా గత జనవరి 31న ప్రారంభించి అందుబాటులోకి తెచ్చారు. దీన్ని నిర్వహణను దాతలు, గ్రామ పంచాయతీ సహకారంతో చేపడుతున్నారు.

అందుబాటులోకి వైఫై..

దినపత్రికలు, తాగునీరు, ఇతర అవసరాలు మాజీ సర్పంచ్ స్వప్న సమకూర్చుతుండగా, మరో మాజీ సర్పంచ్ వైజయంతీ శ్రీనివాస రావ్ ఇటీవల వైఫై సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. మారుమూల ప్రాంతంలో ఎంతో ముందు చూపుతో స్టడీ సెంటర్ ఏర్పాటుకు కృషి చేసిన తాజా మాజీ సర్పంచ్ సంగం స్వప్నశంకరయ్య, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సిర్గాపూర్ గ్రామస్థులకు యువకులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. మరన్ని పస్తకాలు సమకూర్చేందుకు దాతలు ముందుకురావాలని కోరుతున్నారు

యువకుల బాధలు చూసి..



పేదరికం కారణంగా చాలా మంది గ్రామ యువకులు పోటీ పరీక్షలకు దూరంగా ఉంటూ బాధపడుతుండేవారు. దీన్ని చూసి వారి కోసం ఏదైనా చేయాలనే తపనతో గ్రంథాలయ ఏర్పాటు విషయమై నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా సంజీవరెడ్డి దృష్టికి తీసుకెళ్లా. ఆయన వెంటనే స్పందించి సర్వోదయ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేయించారు.

-స్వప్న, మాజీ సర్పంచ్, సిర్గాపూర్

ఆనందంగా ఉంది..



సిర్గాపూర్‌లోని స్టడీ సెంటర్, గ్రంథాలయంతో నిరుద్యోగ యువతకు ఎంతో మేలు జరుగుతున్నది. రుపాయి ఖర్చు లేకుండా సకల సౌకర్యాల మధ్య పోటీ పరీక్షలకు సిద్ధమవడం ఆనందంగా ఉంది. దీనికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. దాతలు ముందుకువచ్చి మరిన్ని పుస్తకాలు అందుబాటులోకి తేవాలి.

-గురునాథ్, లక్ష్మణ్‌నాయక్‌తండా, కడ్పల్



స్టడీ సెంటర్‌లో చదువుకుంటున్న యువకులు

వారోత్సవాలను విజయవంతం చేయాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కేడం లింగమూర్తి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి 20 వరకు నిర్వహించే 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి తెలిపారు. సిద్దిపేట గ్రంథాలయంలోని కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. వారం రోజుల పాటు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నవంబర్ 14న చిత్రలేఖనం, 15న పుస్తక ప్రదర్శన, 16న సుడోకు క్విజ్, 17న కవి సమ్మేళనం, 18న వ్యాసరచన, 19న మహిళా దినోత్సవం, ముగ్గుల పోటీలు, 20న ముగింపు సమావేశం, బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ఈ వారోత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారి పేర్లు గ్రంథాలయ అధికారికి ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ఎం.సుధీర్, తప్పెట శంకర్, కేధారి మధు, గౌసుద్దీన్, నజ్మా తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ దొంగలే

- ఒకాయన ఢిల్లీలో ఉన్నాడు.. మరొకరు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాడు
- లగచర్ల వివాదం, మల్లన్నసాగర్ పోరాటం రెండింటిది ఒకే తీరు
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్/హవేళిఘణపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరూ దొంగలేనని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఘాటు విమర్శలు చేశారు. బుధవారం ఆయన మెదక్ జిల్లా హవేళీఘణపూర్ మండలం తొగిటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. ఆరుగాలం కష్టించి పంట పండించిన రైతుకు ఆ పంటను అమ్ముకునేందుకు దిక్కుతోచడం లేదని వాపోయారు. కేంద్ర ప్రభుత్వమే కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బు చెల్లిస్తుందని వివరించారు. సన్నాలను కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బు చెల్లిస్తుందని వివరించారు. సన్నాలను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తూ అనేక ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు. మద్దూరు పీఏసీఎస్ సొసైటీ నిర్వాహకులు రైతులను బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకోవాలని డైరెక్టర్లు సూచిస్తున్నట్లు రైతులు చెబుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఆ సొసైటీపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లయ్ కమిషనర్ ఏం మాట్లాడుతున్నాడో.. ఆ శాఖలో ఏం జరుగుతుందో సీఎం రేవంత్‌రెడ్డికి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తెలియడం లేదని ఎద్దేవా చేశారు. కేటీఆర్‌ఎస్ ఢిల్లీలో ఉన్నాడని, సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఢిల్లీకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాడన్నారు. వీరిద్దరూ తోడు దొంగలేనని వ్యాఖ్యానించారు. వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో కలెక్టర్‌పై దాడి బాధాకరమన్నారు. ఈ ఘటనలో రాజకీయ ప్రమేయం ఉన్నదని ఆరోపించడం సరికాదని అన్నారు. కలెక్టర్‌పై దాడి జరిగిన అనంతరం రెండురోజులుగా ఆ పరిసర మూడుతండాల్లో మనుషులు కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మల్లన్నసాగర్ కట్టినపుడు కేసీఆర్, హరీశ్‌రావు రైతులను ఎత్తుకెళ్లగా, ప్రస్తుతం అదే తరహాలో లగచర్లలో జరుగుతుందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ విధానాలు వేరుగా అనిపించడం లేదని తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు

భారీగా గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్టు.. 10 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



తూప్రాన్‌లో పట్టుకున్న గంజాయి, నిందితులను చూపిస్తున్న పోలీసులు

తూప్రాన్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : ఒడిస్సా నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్న ఇరువురిని అరెస్టు చేసి వారి నుంచి 10 కిలోల 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం తూప్రాన్ పోలీస్ సబ్‌డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం జీడిపల్లి వద్ద గంజాయి అమ్ముతున్నట్లు మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్‌కు బుధవారం ఉదయం సమాచారం అందింది. ఈ మేరకు సిబ్బందితో కలిసి వెళ్లగా జాతీయ రహదారి 44పై ఉన్న అండర్ పాస్ వద్ద ఓ వ్యక్తి వీరిని చూసి గంజాయి ప్యాకెట్‌ను చెట్లపొదల్లోకి విసిరాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా ఐటీసీ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేసే బీహార్ రాష్ట్రానికి చెందిన రంజన్ కుమార్(30)గా తేలింది. పొదల్లో వేసిన కవర్ తెరిచి చూడగా కిలో గంజాయి లభించింది. ముప్పిరెడ్డిపల్లిలో ఉంటున్న ఒడిశాకు చెందిన శ్రీధర్‌సాహు వద్ద కొనుగోలు చేసినట్లు రంజన్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు అతడి నివాసంలో తనిఖీలు చేయగా 9 కిలోల 300 గ్రాముల గంజాయి లభించింది. వీరిద్దరిని అరెస్టు చేసి గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సీఐ రంగకృషణ్, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్ పాల్గొన్నారు. గంజాయి పట్టుకున్న సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

గంజాయి తరలిస్తున్న నలుగురు అరెస్టు



పట్టుకున్న గంజాయి, నిందితులను చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

పటాన్‌చెరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తున్న నలుగురిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఒరిస్సాకు చెందిన ఇద్దరు మహిళలు ఎర్మెసునమ్ (33), పునీం (33), ఇద్దరు వ్యక్తులు మడ్కాన్ లచ్చా (27), టోకిర్‌హబీబ్ (28) ఒరిస్సా సరిహద్దు నుంచి గంజాయిని పలు మార్గాల్లో పటాన్‌చెరుకు తరలించారు. అనంతరం మండల పరిధిలోని ఘనాపూర్, పటాన్‌చెరు పట్టణ శివారులోని వ్యాల్యూజోన్ హైపర్ మార్కెట్ వద్ద విక్రేతల కోసం వారు ఎదురు చూస్తున్నారు. దీనిపై విశ్వసనీయం సమాచారం అందుకున్న సంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బుధవారం ఉదయం దాడులు నిర్వహించి వారి నుంచి ఆరున్నర కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు 3లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ప్రధానోపాధ్యాయురాలిని తొలగించాలి

- ఎంఈవోకు గ్రామస్థుల ఫిర్యాదు



ఎంఈవో కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

కంగ్టి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్న దెగుల్‌వాడి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. స్కూల్ హెచ్ఎం రేఖారాణి ఒక్క రోజు కూడా ప్రార్థనా సమయానికి వచ్చిన దాఖలాలు లేవన్నారు. ఈ విషయమై ఇప్పటికే ఆమెను నిలదీసినా, అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. నిత్యం హైదరాబాద్ నుంచి రాకపోకలు కొనసాగిస్తుండడంతో పాఠశాలకు మధ్యాహ్నం చేరుకుంటుందన్నారు. తక్షణమే ఆమెను ఇక్కడి నుంచి తొలగించాలన్నారు. ఈ విషయమై హెచ్ఎంను సంప్రదించగా తాను నిత్యం కారులో పాఠశాలకు వస్తానని, ఎప్పుడైనా బస్సుకు వచ్చినప్పుడు మాత్రమే కాస్త ఆలస్యమవుతుందని వివరించారు. కొందరు కావాలనే ఇదంతా చేస్తున్నారని చెప్పారు.



తనిఖీలు చేస్తున్న రాష్ట్ర విజిలెన్స్ అధికారులు.

రైస్‌మిల్లులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

పెద్దశంకరంపేట, నవంబరు 13.(ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మండల పరిధిలోని ఉత్తులూర్ వద్ద ఉన్న సప్తగిరి రైస్‌మిల్లును బుధవారం సాయంత్రం రాష్ట్ర విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. వీరోజ్‌పల్లి తండాకు చెందిన ఓ వ్యక్తి మిల్లు నిర్వాహకులు ధాన్యం సకాలంలో తీసుకోవడం లేదని, అదనంగా బస్తాకు నాలుగు కిలోలు తూకం వేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిల్లులో విచారణ చేపట్టారు. వీరోజ్‌పల్లితో పాటు పరిసర గ్రామాలలోని రైతులను విచారించారు. మిల్లులో వరి ధాన్యం తీసుకుంటున్నారా..? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని తేమ లేకుండా తీసుకురావాలని మిల్లు వ్యాపారులకు సూచిస్తున్నారని, కొంత ధాన్యం తేమ ఉన్నా తీసుకుంటున్నారని రైతులు అధికారులకు తెలిపారు. ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తికి అసలు భూమేలేదని నకిలీ ఫిర్యాదు చేశారని గుర్తించిన అధికారులు అతని పై కేసు నమోదు చేయాలని స్థానిక ఎస్ఐ శంకర్‌కు విజిలెన్స్ అధికారులు సూచించారు. ఈ తనిఖీలో అడిషనల్ ఎస్పీలు ద్రోణాచార్యులు, శ్రీధర్ రెడ్డి, తహసీల్దార్ ప్రభాకర్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, సాంబశివరావు, ఏఎస్‌వో సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రింగ్‌రోడ్డుపై క్వాలీస్ పల్టీ

- ఆరుగురికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు, నవంబరు, 13 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ శివారులోని సుల్తాన్‌పూర్ గ్రామ పరిధిలో నెహ్రూ ఔటర్‌రింగ్ రోడ్డుపై క్వాలీస్ వాహనం పల్టీలు కొట్టిన సంఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం శంకర్‌పల్లి మండలం దోబీపేట్ గ్రామానికి చెందిన చరణ్, వివేక్, మహేందర్, చింటు, బబ్లూ, సతీష్ మంగళవారం రాత్రి మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. తిరిగి అర్థరాత్రి ఒంటిగంట సమయంలో ముత్తంగి జంక్షన్ వద్ద స్వీట్‌హార్ట్ హోటల్‌లో టీ తాగారు. అనంతరం అక్కడి నుంచి యాదగిరిగుట్టకు వెళ్లేందుకు ఔటర్‌రింగ్ రోడ్డుపై నుంచి బయలుదేరారు. కిష్టారెడ్డిపేట, సుల్తాన్‌పూర్ గ్రామాల మధ్యకు రాగానే అతివేగంలో ఉన్న వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి పల్టీ కొట్టడంతో అందులో ఉన్న ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని పటాన్‌చెరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు పోలీసలు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అంబులెన్స్‌లో క్షతగాత్రులు

పెద్దలకు ఉచితం.. పేదలకు భారం..

- నర్సాపూర్‌వాసులపై గుమ్మడిదల టోల్ గేట్ సిబ్బంది పక్షపాత ధోరణి
- నాయకులైతే నో టోల్.. సామాన్యులైతే చెల్లించాల్సిందే..
- 15 కిలోమీటర్ల దూరం కూడా లేని గ్రామానికి టోల్ తగునా?

నర్సాపూర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మెదక్-హైదరాబాద్ 765డి జాతీయ రహదారిగా విస్తరించాక సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల సమీపంలో ఏర్పాటు చేసిన టోల్ గేట నర్సాపూర్ పట్టణవాసులకు శాపంగా మారింది. నిబంధనల ప్రకారం 20కిలోమీటర్ల లోపు ఉన్న గ్రామాలకు టోల్ వసూలు చేయకూడదు. నర్సాపూర్ నుంచి టోల్‌గేటు వరకు 15 కిలోమీటర్ల దూరం కూడా లేదని అయినా పట్టించుకోకుండా నర్సాపూర్ వాసుల నుంచి టోల్ వసులు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. నర్సాపూర్‌కు చెందిన ప్రముఖులు, నాయకులు, రాజకీయ పలుకుబడి ఉన్న వారిని ఉచితంగా పంపిస్తున్నారని, సామాన్యుల నుంచి మాత్రం డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పెద్దలకు వర్తించిన నిబంధనలు పేదలకు వర్తించవా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామస్థులందరికీ టోల్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు.



గుమ్మడిదల వద్ద జాతీయ రహదారిపై టోల్ గేటు

మహిళ కడుపులోని 9.5కిలోల కణితి తొలగింపు

సిద్దిపేట టౌన్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): అరుదైన శస్త్రచికిత్స చేసి మహిళ కడుపులో నుంచి 9.5 కిలోల కణితి (గడ్డ) తొలగించినట్లు సిద్దిపేట పట్టణంలోని లోహిత్ సాయి ఆసుపత్రి చైర్మన్, డాక్టర్ ఏ. భాస్కర్ తెలిపారు. బుధవారం ఆసుపత్రిలో ఆయన మాట్లాడుతూ చేర్యాల గ్రామానికి చెందిన ఓ మహిళ కడుపు నొప్పి, ఉబ్బుతుందని 4 రోజుల క్రితం ఆసుపత్రికి వచ్చినట్లు తెలిపారు. దీంతో వైద్యులు స్కాన్ చేసి కడుపులో కణితి (గడ్డ) ఉందని గుర్తించి సర్జరీ ద్వారా తొలగించినట్లు తెలిపారు.



అద్దె భవనాలు.. అరకొర వసతులు



నిజాంపేటలో శిథిలావస్థకు చేరిన పెంకుటింట్లో తహసీల్ కార్యాలయం, ఇరుకు గదిలో పల్లె దవాఖానా

- నిజాంపేట మండలంగా ఏర్పాటై ఎనిమిదేళ్లయినా కనిపించని అభివృద్ధి
- శిథిలావస్థకు చేరిన కార్యాలయ భవనాలు
- అభివృద్ధికి చర్యలు శూన్యం
- 40 ఏళ్ల క్రితమే మాస్టర్ ప్లాన్‌కు నిధులు

నిజాంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దాదాపు ఎనిమిదేళ్ల క్రితం నిజాంపేట కొత్త మండలంగా ఏర్పడినప్పుడు ఇక తమ కష్టాలన్నీ గట్టెక్కినట్టేనని స్థానికులు సంబరపడ్డారు. ఇక మనం ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు.. ఉన్న చోటే అన్ని పనులు చేసుకోవచ్చని నిజాంపేట వాసులు సంతోషం వ్యక్తం చేశారు. అందుకు తగినట్టుగానే అప్పట్లోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సైతం అక్కడ ఏర్పాటు చేశారు. అయితే కొత్త మండలం ఏర్పడి ఎనిమిదేళ్లయినా అభివృద్ధి మాత్రం జరగలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కొందరి స్వార్థం వల్లే..



నేను 1987వ సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాస్టర్ ప్లాన్ కోసం నిధులు తెచ్చా. కానీ కొందరు స్వార్థ రాజకీయ లబ్ధికోసం అడ్డుపడ్డారు. దీంతో నాటి నుంచి నేటి వరకు నిజాంపేట మండలంగా ఏర్పడినా, అభివృద్ధిలో మాత్రం వెనుకబడే ఉన్నది.

-వడ్ల తిరుమలయ్య, మాజీ సర్పంచ్

శిథిల భవనాల్లోనే కార్యాలయాలు

సుమారు 25 వేల జనాబా ఉన్న నిజాంపేట మండలంలో 14 గ్రామాలు, 16 గిరిజన తండాలు ఉన్నాయి. వారంతా గతంలో ఏ చిన్న పని ఉన్నా.. రామాయంపేటకు వెళ్లాల్సి వచ్చేది. కొత్త మండలం పుణ్యమా అంటూ స్థానికంగానే అన్ని పనులు పూర్తయ్యే వెసులుబాటు కలిగింది. అయితే ఒక్క ప్రభుత్వ కార్యాలయానికీ సొంత భవనం నిర్మించలేదు. కార్యాలయాలన్నీ శిథిలావస్థకు చేరిన అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో ఏదైనా పని కోసం ఆయా కార్యాలయాలకు వెళ్లేవారు పడరాని పాట్లు పడుతున్నారు.

అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

కొత్త మండలంగా ఏర్పాటైన తర్వాత ప్రజలు ఎంతగా సంబరపడ్డారో.. ఆ తర్వాత సరైన అభివృద్ధికి నోచుకోకపోవడంతో అదేస్థాయిలో నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఇదేనా కొత్త మండలం తీరు అంటూ మండిపడుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిజాంపేట మండల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ అన్ని సౌకర్యాలతో కూడిన సొంత భవనాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఏళ్ల క్రితమే నిధులు మంజూరైనా..

నలభై ఏళ్ల క్రిందటే నిజాంపేటను పురోభివృద్ధిలోకి తెచ్చేందుకు అప్పటి సర్పంచ్ వడ్ల తిరుమలయ్య మాస్టర్ ప్లాన్ తయారు చేశారు. ఇందుకోసం ఐదు లక్షలు నిధులు తీసుకువచ్చి ఆర్టీసీ బస్టాండ్, షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుపై దృష్టి పెట్టారు. కానీ కొందరు స్వార్థ రాజకీయం కోసం దీన్ని అడ్డుకోవడంతో ఆ ప్రణాళిక కాస్త దెబ్బతిన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నిజాంపేట కొత్త మండలంగా ప్రకటించి, అద్దెభవనాల్లో కార్యాలయాలను సైతం ఏర్పాటు చేసి మండలకేంద్రంగా తీర్చిదిద్దారు. కొత్త మండలంగా ఏర్పాటుతో చోటు చేసుకున్న సంతోషం మూణ్ణాళ్ల ముచ్చటే అయ్యింది. మండలంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది.


నిజాంపేట ముఖ చిత్రం

ప్రభుత్వ ఆసుపత్రిలో అధిక ప్రసవాలు జరగాలి


నార్సింగి పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీరాం

చేగుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరాం బుధవారం సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆపరేషన్ థియేటర్, ల్యాబ్‌రూమ్, మందుల స్టోర్ రూమ్‌లతో పాటు ఆసుపత్రికి వచ్చే రోగుల అవుట్ పేషెంట్ రికార్డులను పరిశీలించారు. అనంతరం అక్కడి సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించి, రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగేలా సిబ్బంది చొరవ చూపాలన్నారు. మాత శిశు మరణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అధిక ప్రసవాలు జరిగేలా గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. వెంట తూప్రాన్, నర్సాపూర్, మెదక్ అదనపు వైద్యాధికారులు జ్ఞానేశ్వర్, నవీన్‌కుమార్, సృజన, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు

నాగల్‌గిద్ద, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి ముక్టాపూర్ వరకు గుంతల మయమైన రోడ్లను బుధవారం చేపట్టిన మరమ్మతు పనులను ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీనివాస్ పరిశీలించారు.

సర్వేలో పొరపాట్లు జరగొద్దు: మెదక్ కలెక్టర్


మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్/నర్సాపూర్, నవంబరు(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సర్వేపై నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే ఫారం నింపే విధానంపై అధికారులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వేలో ఫారాలు నింపే విధానాన్ని నోడల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. సర్వే లక్ష్యాలను నెరవేర్చే బాధ్యత ఎన్యూమరేటర్లదేనన్నారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తూ.. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని నోడల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, సీపీవో బద్రీనాథ్, డీపీవో యాదయ్య, నోడల్ అధికారులు పాల్గొన్నారు. నర్సాపూర్ పట్టణంలోని 13వ వార్డులో నిర్వహిస్తున్న సామాజిక సమగ్ర సర్వేను ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లతో మాట్లాడి తగిన సూచనలు అందజేశారు.

సంగారెడ్డి జిల్లాలో..

సంగారెడ్డి అర్బన్/కోహీర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే వివరాల నమోదులో నిర్లక్ష్యం వద్దని సంగారెడ్డి పట్టణ, మండల స్పెషల్ ఆఫీసర్, డీవైఎస్‌వో ఎం.ఖాసీంబేగ్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని బ్యాంక్‌కాలనీ, ఏపీహెచ్‌బీ తదితర కాలనీల్లో బుధవారం కొనసాగుతున్న సర్వేను ఆయన స్వయంగా పరిశీలించారు. కోహీర్ మండలంలోని ఆయా గ్రామాలలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే బుధవారానికి 3,457కుటుంబాలలో సర్వే చేయడం పూర్తయిందని కోహీర్ ఎంపీడీవో భారతి పేర్కొన్నారు. బుధవారం పలు గ్రామాలను సందర్శించిన ఎంపీడీవో సర్వే విధానాన్ని ఆమె పరిశీలించారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

నర్సాపూర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దచింతకుంట సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా బొంతపల్లి సమీపంలోని న్యూలాండ్ లేబరేటరీస్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో రసాయన శాస్త్రం విభాగం విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 120 మంది విద్యార్థులు పాల్గొని ఫార్మాసంస్థ నిర్వహించిన పరీక్ష రాశారు. ప్రతిభ చూపినవారికి ఇంటర్వ్యూలు నిర్వహించి పరిశ్రమలో ఉద్యోగం కల్పిస్తామని ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితాయే లక్ష్యం

సంగారెడ్డి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నామని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం వివిధ పార్టీల ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా రూపొందించేందుకు తప్పులు దొర్లకుండా పక్కా ప్రణాళికలతో పనిచేస్తున్నామని, ప్రజాప్రతినిదులు తమకు సహకరించాలని ఆర్డీవో కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ

నారాయణఖేడ్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని చాప్టాకె, సిర్గాపూర్, వాసర్, అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం నారాయణఖేడ్ ఇన్‌చార్జి సీడీపీవో సుజాత, సూపర్ వైజర్‌లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

టీచర్లు సమయపాలన పాటించాలి

అల్లాదుర్గం, నవంబరు 13. (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని అల్లాదుర్గం ఎంఈవో ధనుంజయగౌడ్. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

కలెక్టర్, ఎస్పీలకు ఆహ్వానం

సంగారెడ్డి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం ఫసల్వాది గ్రామంలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే శ్రీ రామయాగ మహోత్సవానికి రావాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేష్‌లను మహేశ్వరశర్మ సిద్ధాంతి బుధవారం ఆహ్వానపత్రికను అందించారు.

అధికంగా తూకం వేస్తే చర్యలు: డీఆర్డీవో జ్యోతి

నారాయణఖేడ్/కల్హేర్/టేక్మాల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతుల ధాన్యంను అధికంగా తూకం వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో జ్యోతి హెచ్చరించారు. నారాయణఖేడ్ మండలంలోని తుర్కపల్లి, ర్యాకల్, వెంకటాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్దేశించినదానికంటే ఎక్కువ తరుగు పేరిట తీయకూడదని సూచించారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించకూడదని, కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలని సూచించారు. వెంట డీపీఎం జయశ్రీరాజ్, ఏపీఎం వంశీక్రిష్ణ, సీసీలు పాల్గొన్నారు. కల్హేర్ మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట, ఇందిరానగర్, కల్హేర్, మార్డి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి బుధవారం పరిశీలించారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని రెవెన్యూ, ఐకేపీ అధికారులకు సూచించారు. కేంద్రాల్లో ఇబ్బందులున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. క్రిష్టాపూర్‌లోని కొనుగోలు కేంద్రాన్ని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ పరిశీలించారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అధికారులు ప్రారంభించారు.


ఖేడ్‌లో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఆర్డీవో

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

రేగోడు నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి లింగంపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన జన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని వట్‌పల్లి మార్కెట్‌కమిటీ చైర్మన్ లక్ష్మి శేషారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి సునీల్, నాయకులు తదితరులు ఉన్నారు.

వేతనాలు చెల్లించేవరకూ పనులు చేయం


పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న డీఎల్పీవో

కోహీర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తమకు చెల్లించాల్సిన నాలుగు నెలల వేతనం చెల్లించేంతవరకు పంచాయతీలో పారిశుధ్య పనులు చేపట్టబోమని కోహీర్ మేజర్ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు డివిజనల్ పంచాయతీ అధికారి అమృతకు తేల్చి చెప్పారు. వారం, పది రోజుల్లో కార్మికులకు వేతనాలు అందేలా చూస్తామని డీఎల్పీవో అమృత చెప్పినప్పటికీ కార్మికులు ససేమిరా అంటూ తిరస్కరించారు. వేతనాలు ఇప్పుడే చెల్లిస్తే వెంటనే పనుల్లో చేరుతామని ఆమెకు తేల్చి చెప్పారు. మూడు రోజులుగా పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టినా జిల్లా పంచాయతీ అధికారి ఇప్పటివరకు స్పందించకపోవడం శోచనీయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి తమకు నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు లక్ష్మణ్‌రావు, ప్రమోద్, సజీవ్, శీను, నర్సింహులు, ఘనీమియ, ముజఫర్, రవికాంత్, యాదమ్మ, పోచమ్మ, బాలమణి సంతోషమ్మ, లక్ష్మి, రత్నమ్మ, దశరథ్ తదితరులు ఉన్నారు.

నస్కల్‌లో ఖాళీ బిందెలతో నిరసన

నిజాంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో బుధవారం మైసమ్మ గల్లీ కాలనీకి చెందిన మహిళలు ఖాళీబిందెలతో నిరసన చేపట్టారు. కాలనీవాసులు మాట్లాడుతూ కొన్ని రోజులుగా కాలనీలో తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో నీటి ఎద్దడి తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మమత వివరణ ఇస్తూ కాలనీ వాసులకు వచ్చే పైపు లైన్ లీకేజీ ఉన్నందున సమస్య ఏర్పడిందని, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.


ఖాళీబిందెలతో కాలనీవాసుల నిరసన

పొగాకు ఉత్పత్తుల వాడకంతో నష్టాలపై అవగాహన



జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులతో అవగాహన ర్యాలీ

జిన్నారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తుల వాడకంతో తలెత్తే ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు అవగాహన, ర్యాలీని నిర్వహించారు. బుధవారం జిన్నారంలో జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా గాంధీ పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జిన్నారంలో ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో కళాశాల, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెదక్‌లో పదోతరగతి మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలి


ఎంపీ రఘునందన్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మెదక్ అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రంలో పదోతరగతి మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలని ఎంపీ రఘునందన్‌రావుకు ఉపాధ్యాయ సంఘాలు వినతిపత్రాన్ని అందజేశాయి. బుధవారం మెదక్ పట్టణానికి వచ్చిన ఎంపీని కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా తపస్, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, రాజ్‌గోపాల్‌గౌడ్, లక్ష్మణ్, మాట్లాడుతూ..పది పరీక్ష పేపర్ల మూల్యాంకనం సంగారెడ్డి జిల్లా బీహెచ్ఈఎల్‌కు వెళ్లి చేయాలంటే ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వద్దు

పటాన్‌చెరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో అలసత్వాన్ని సహించేది లేదని ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి జీహెచ్ఎంసీ పారిశుధ్య సిబ్బందిని హెచ్చరించారు. పటాన్‌చెరు, రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్లలో పారిశుధ్య నిర్వహణపై క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కాలనీల్లో చెత్త క్రమం తప్పకుండా తీసుకుపోవడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. డివిజన్లలో చెత్త సేకరణకు వినియోగిస్తున్న వాహనాలు చెడిపోయాయని కొత్తవాటిని నిధులు మంజూరు చేయించాలని సిబ్బంది ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సురేష్, హెల్త్ అధికారి విజయ్‌కుమార్, రాంకీ సంస్థ ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలకు 10 ఎకరాల స్థలం

పుల్‌కల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోని ఫార్మసీ కళాశాలకు 10 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ హామీ ఇచ్చారు. ఈ మేరకు జేఎన్టీయూహెచ్ రెక్టార్ ప్రొఫెసర్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్‌రావు, సుల్తాన్‌పూర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.నరసింహులు హైదరాబాద్‌లో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పెండింగ్ సమస్యలను వివరించి, మంత్రిని శాలువాతో ఘనంగా సత్కరించారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో కొనసాగుతున్న ఫార్మసీ కళాశాలను ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

నిజాంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్డీవో రమాదేవి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్ కార్యాలయం శిథిలావస్థలో ఉన్నందున నూతనంగా ఏర్పాటు అవుతున్న అద్దె భవనాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని 8 వ వార్డులో కుటుంబ సర్వేను డీపీవో యాదయ్య పరిశీలించారు.

బార్లా తెరిచారు...

- నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్‌రూమ్‌ల నిర్వహణ

(5వ పేజీ తరువాయి)

వాపోతున్నారు. పాడైపోయిన తినుబండారాలు తిన్న కొందరికి మరుసటి రోజు వాంతులు, విరేచనాలు కూడా అయిన సందర్భాలున్నాయి. పర్మిట్‌రూమ్‌లలో పరిశుభ్రత పాటించడం లేదు. కొందరు మద్యం సేవించి అక్కడే మూత్ర విసర్జన చేయడం, ప్లాస్టిక్ వస్తువులు ఎక్కడ పడితే అక్కడ పారవేయడంతో పర్మిట్‌రూమ్‌లు దుర్వాసనతో కంపు కొడుతున్నాయి.

కన్నెత్తి చూడని అధికారులు

నిబంధనలకు నీళ్లొదిలి పర్మిట్‌రూమ్‌లను నిర్వహిస్తున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో నిద్రరోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బల్లాలు, బెంచీలు ఏర్పాటు చేసి మద్యం సిట్టింగ్‌లు నిర్వహిస్తున్నా అధికారులు మాత్రం అటువైపు తొంగి చూడటం లేదు. కొన్ని పర్మిట్‌రూమ్‌లు నివాస ప్రాంతాల్లో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అయినా, అధికారులు పర్మిట్‌రూమ్‌లను తనిఖీ చేయడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. ఇక పర్మిట్‌రూమ్‌లలో పాడైపోయిన తిను బండారాలు విక్రయిస్తూ మద్యం వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్నా ఫుడ్ సేఫ్టీ అధికారులు సైతం పట్టించుకోవడం లేదు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతి


మృతి చెందిన వృద్ధురాలు

సంగారెడ్డి క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొని గుర్తుతెలియని వృద్ధురాలు(75) మృతి చెందింది. ఈ ఘటన సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురం వద్ద మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. బుధవారం పట్టణ సీఐ ఎస్.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రిపూట గుర్తు తెలియని వృద్ధురాలు వైకుంఠపురం వద్ద ఎస్ఆర్ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు దాటుతుండగా సంగారెడ్డి నుంచి జోగిపేట వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలిని 108 అంబులెన్స్ సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ భాస్కర్ సూచించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు పక్కన నిలిపిన కారు చోరీ

నాగల్‌గిద్ద, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రోడ్డుపక్కన నిలిపిన కారును గుర్తు తెలియని దుండగులు అపహరించారు. ఈ సంఘటన మండల పరిధిలోని మోర్గి చౌరస్తా సమీపంలో చోటు చేసుకున్నది. బుధవారం నాగల్‌గిద్ద ఎస్ఐ బి.సాయిలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మనూరు మండలం ఉసిరికేపల్లి గ్రామానికి చెందిన విష్ణు కారు(ఏపీ23 ఏడీ9666)లో ఈ నెల 11న రాత్రి బీదర్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో రాత్రి 11 గంటల సమయంలో మూత్ర విసర్జన కోసం కారును రోడ్డు పక్కకు నిలిపి మూత్ర విసర్జన చేస్తుండగా, అదే సమయంలో వెనుక నుంచి బులేరో వాహనంలో వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆగి ఉన్న కారును అపహరించారు. బుధవారం నాగల్‌గిద్ద పోలీస్ స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి


బల్‌బీం(ఫైల్)

నారాయణఖేడ్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. కంగ్టి మండలం రాసోల్ గ్రామానికి చెందిన బల్‌బీం(50) మనూరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన రెండు మూడు రోజులుగా అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇరువురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

కోహీర్ నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల విద్యాధికారి జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలను సందర్శించిన విద్యాధికారి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

జహీరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులు పంటలసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు రమేష్ తదితరులు పేర్కొన్నారు. బుధవారం మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లితండా, న్యాల్‌కల్ మండలంలోని మామిడిగి, శంశల్లాపూర్, ఝరాసంగం మండలంలోని పొట్టిపల్లి, కంగ్టిమండలంలోని నాగూర్(కే), కిసాన్‌నాయక్ తండాల్లో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి లింగాకర్షకబుట్టలు, వేపనూనెను పంపిణీ చేశారు. ఈ సందర్భంగ ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో ఆయన సేంద్రీయ ఎరువుల తయారీ విధానం గురించి రైతులకు వివరించారు. ముఖ్యంగా రైతులు పంటలసాగు విషయంలో అధికారుల, శాస్త్రవేత్తల సలహాలు పాటించాలన్నారు.

'వచ్చే ఎన్నికల్లో సగరులు సత్తా చాటాలి'

పుల్‌కల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సగరులు సత్తా చాటాలని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.మురళీకృష్ణ పేర్కొన్నారు. చౌటకూర్ మండలం ఉప్పరిగూడెం గ్రామంలో సగర సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మండల శివకుమార్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సగర సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వచ్చే ఎన్నికల్లో సగరులు ఐక్యంగా తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కుల గణనలో సగరుల జనాభా ఎంత ఉందో స్పష్టం కానున్నట్టు చెప్పారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ

నారాయణఖేడ్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో అభ్యర్థులను రంగంలో ఉంచుతుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు బస్వరాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు పత్రి రామక్రిష్ణ తెలిపారు. బుధవారం ఖేడ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. త్వరలో జరుగనున్న సర్పంచు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కార్యకర్తలు గ్రామాల్లో కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ కోకన్వీనర్ నగేష్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు సిందోల్ దశరథ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అత్యధికంగా బీజేపీ సభ్యత్వ నమోదు చేయాలి

చిన్నశంకరంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అత్యధికంగా బీజేపీ సభ్యత్వ నమోదు చేయాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నందారెడ్డి పేర్కొన్నారు, మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు పోగుల రాజు అధ్వర్యంలో బుధవారం సభ్యత్వ నమోదుకు సంబంధించి నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త అత్యధికంగా పార్టీ సభ్యత్వ నమోదుకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి , సభ్యత్వ ఇన్చార్జి రాగి రాములు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో చేప పిల్లల పంపిణీ


చెరువులో చేప పిల్లలను వదులుతున్న దృశ్యం

వెల్దుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలోని కూడిచెరువు, గ్రామ శివారులో ఉన్న దేవతల చెరువులో వెల్దుర్తి మత్స్యకారుల గ్రామ అధ్యక్షుడు బాల్‌రాజు ఆధ్వర్యంలో మత్స్యకారుల శాఖ అధికారులు బుధవారం చేప పిల్లలను విడుదల చేశారు. వెల్దుర్తి కూడి చెరువులో లక్షా 85 వేలు, దేవతల చెరువులో లక్షా 85వేల చేప పిల్లలను విడుదల చేసినట్టు తెలిపారు.

ఘనంగా బ్రహ్మంగారి జయంతి ఉత్సవాలు


బ్రహ్మంగారి మఠంలో ప్రత్యేక పూజల్లో భక్తులు

రేగోడు నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో స్వామివారి 416వ జయంతి ఉత్సవాలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, డోలారోహణ కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి భక్తులు తరలివచ్చారు. జయంతిని పురస్కరించుకొని గుడికాడి రాజు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.